నిరుద్యోగి కన్నెర్ర

గ్రూప్ 2,3 పోస్టులు పెంచాలని కోరుతూ ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

శనివారం అర్ధరాత్రి అశోక్‌నగర్‌లో రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు, వివిధ పరీక్షల అభ్యర్థులు

నిందలేసిన రేవంత్.. భగ్గుమన్న యూత్

మొదటిపేజీ తరువాయి...

ఎల్బీనగర్‌తోపాటు, ఇతర అనేక చోట్ల వేలాది మంది ఉద్యోగార్థులు రోడ్డెక్కారు. కాంగ్రెస్ సర్కారు తీరుపై నిప్పులు చెరుగుతూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. అభ్యర్థుల ధర్నాలతో ఎక్కడికక్కడ గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోయింది. మరోవైపు భారీగా పోలీసులు మోహరించి అభ్యర్థులను పంపిచేందుకు యత్నించినా ఎలాంటి ఫలితం లేకుండాపోయింది.

అశోక్‌నగర్‌లో అర్ధరాత్రి రోడ్డెక్కిన నిరుద్యోగులు

గ్రూప్ 2 పరీక్షలు యథావిధిగా నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి జేఎన్టీయూ వేదిగాక శనివారం సాయంత్రం ప్రకటించారు. ఆ వెంటనే గంటల వ్యవధిలోనే నిరుద్యోగులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులు పెంచడంతో పాటు డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శనివారం రాత్రి అశోక్‌నగర్ చౌరస్తాలో వేలాదిమంది సంఖ్యలో నిరుద్యోగులు మెరుపు ధర్నాకు దిగారు. పెద్దఎత్తున రాస్తారోకో చేశారు. చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీ నుంచి అశోక్‌నగర్ చౌరస్తా వరకూ భారీ ర్యాలీ తీశారు. చౌరస్తాలోనే రోడ్డుపైనే బైఠాయించారు. రాత్రి 9గంటల నుంచి అర్ధరాత్రి వరకూ అక్కడే రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.నిరుద్యోగుల దీక్షలపై సీఎం చేసిన అనుచిత వ్యాఖ్యలపై నిప్పులు చెరిగారు. 'సీఎం డౌన్ డౌన్' అంటూ అభ్యర్థులు చేసిన నినాదాలతో అశోక్‌నగర్ దద్దరిల్లిపోయింది. 'ఇదేమి లెక్క.. గుంపు మేస్త్రీ లెక్క' అంటూ నినాదాలతో హోరెత్తించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు తామంతా కృషిచేశామని, తమ బాధను అర్థం చేసుకుని ప్రభుత్వం తక్షణమే తమ డిమాండ్లను అంగీకరించాలని డిమాండ్ చేశారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో డీఎస్సీ అభ్యర్థులు..

అశోక్‌నగర్‌లో గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల అభ్యర్థులు ధర్నాకు దిగిన సమాచారం తెలుసుకున్న డీఎస్సీ అభ్యర్థులు క్షణాల్లో దిల్‌సుఖ్‌నగర్‌లో ధర్నాకు దిగారు. వెంకటాద్రి థియేటర్ నుంచి మెట్రో స్టేషన్‌వరకు ర్యాలీ తీశారు. రాజీవ్ చౌక్‌లో ధర్నాకు దిగారు. డీఎస్సీని తక్షణమే వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. ''వుయ్ వాంట్ జస్టిస్.. కాంగ్రెస్ డౌన్ డౌన్.. సీఎం డౌన్ డౌన్' అంటూ నినదించారు. తమ సమస్యను రాజకీయ కోణంలో చూడవద్దని, రాష్ట్ర భవిష్యత్ దృష్టిలో చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. న్యాయమైన డిమాండ్లతో తాము చేస్తున్న ధర్నాలను బీఆర్ఎస్, బీజేపీలతో అంటగట్టి రాజకీయం చేయడం సమంజసం కాదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దిల్‌సుఖ్‌నగర్‌తో పాటు ఎల్బీనగర్ లోనూ అభ్యర్థులు ఆందోళనకు దిగడంతో పోలీసులు భారీగా మోహరించారు.

స్తంభించిన ట్రాఫిక్..

నిరుద్యోగుల మెరుపు ధర్నాతో అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్ రూట్లలో భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. గంటల తరబడి వాహనాలు రోడ్లపైనే నిలిచిపోయాయి. మరోవైపు అశోక్‌నగర్‌లో ఏసీపీ రమేశ్ ఆధ్వర్యంలో దోమలగూడ, ముషీరాబాద్ పీఎస్‌లతోపాటు, అదనపు సీఆర్పీఎఫ్ బలగాలు రోడ్లపై మోహరించాయి. నిరుద్యోగులను బలవంతంగా పంపించేందుకు యత్నించాయి. అయినా అభ్యర్థులు తమ డిమాండ్లు నెరవేర్చేదాకా కదిలేది లేదని రోడ్లపైనే భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో అర్ధరాత్రి దాటినా పరిస్థితి అదుపులోకి రాలేదు.

గ్రూప్స్ అభ్యర్థిని ఆత్మహత్యాయత్నం

ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై నిరుద్యోగులు మెరుపు ధర్నాకు దిగిన సమయంలోనే ఓ అభ్యర్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అశోక్‌నగర్ ధర్నాలో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం ముర్రవానిగూడెం గ్రామానికి చెందిన అభ్యర్థిని మడకం నిత్యమైత్ర పాల్గొన్నది. ఈ క్రమంలో ఒక్కసారిగా ఆవేదనకు గురై వెంటతెచ్చుకున్న గోలీలు మింగి రోడ్డుపైనే పడిపోయింది. సహచర అభ్యర్థులు వెంటనే గాంధీ దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఎమర్జెన్సీ ఏఎంసీ వార్డులో చికిత్స అందిస్తున్నారు. అభ్యర్థిని కిందపడిపోవడంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

• సార్‌కోదండం

ప్రొఫెసర్ కోదండరాం చిత్రపటాన్ని చెప్పుతో కొడుతున్న విద్యార్థులు

• ఆత్మహత్యాయత్నం

నిద్ర మాత్రలు మింగిన అభ్యర్థికి గాంధీ దవాఖానలో చికిత్స

దీక్షాపరులపై రేవంత్‌రెడ్డి హేళన

మోతీలాల్ సహా దీక్షాపరులు ఉద్యోగార్థులే కాదని వ్యాఖ్యలు

గ్రూప్స్1, 2, 4కు మోతీలాల్ దరఖాస్తు • ఆధారాలతో బయటపెట్టిన అభ్యర్థులు

హైదరాబాద్, జూలై13 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగుల డిమాండ్ల సాధన కోసం అభ్యర్థి మోతీలాల్ ఇటీవల దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. ఆయన దీక్షను భగ్నం చేస్తూ పోలీసులు అరెస్టు చేసినా గాంధీ దవాఖానలో దీక్ష కొనసాగించారు. అయితే తాజాగా జేఎన్టీయూలో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగుల దీక్షను అపహాస్యం చేస్తూ మాట్లాడారు. మోతీలాల్ దీక్షపై విమర్శలు గుప్పించారు. దీక్ష చేస్తున్నవారెవరూ పరీక్షలు రాయడం లేదని చులకనగా మాట్లాడారు. నిరుద్యోగ దీక్షలను రాజకీయ దీక్షలుగా అభివర్ణించారు. వాస్తవానికి మోతీలాల్ జూన్ 2024లో గ్రూప్-1 పరీక్షకు హాజరయ్యాడు. అతను గ్రూప్ 2, 3, 4 పరీక్షలకు కూడా దరఖాస్తు చేసుకున్నాడు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. అవేవీ తెలియకుండానే సీఎం రేవంత్‌రెడ్డి హేళన చేస్తూ మాట్లాడడంపై నిరుద్యోగులు మండిపడుతున్నారు. వివిధ పరీక్షలకు మోతీలాల్ చేసుకున్న దరఖాస్తులను ఆధారాలతో చూపిస్తూ సామాజిక మాధ్యమాల్లో నిప్పులుచెరిగారు.

మోతీలాల్ నాయక్ హాల్‌టికెట్

డీఎస్సీ వాయిదా వేయాలని దిల్‌సుఖ్‌నగర్‌లో ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

గతేడాది తమ ఆందోళనకు మద్దతు పలికిన రాహుల్ ఫొటోను అశోక్‌నగర్‌లో ప్రదర్శిస్తున్న నిరుద్యోగులు

సీఎం అభాసుపాలుకాకండి

గ్రూప్స్ అభ్యర్థులు, నిరుద్యోగుల మొర ఆలకించాలి. సీఎం రేవంత్‌రెడ్డికి మరోసారి విజ్ఞప్తి చేస్తున్న. భేషజాలకు పోకుండా గ్రూప్స్ అభ్యర్థులు, నిరుద్యోగులను చర్చలకు పిలిచి, డిమాండ్లను అర్థం చేసుకొనే ప్రయత్నం చేయండి. వారిని రెచ్చగొట్టేలా, కించపరిచేలా మాట్లాడి అభాసుపాలు కాకండి. వారు ధైర్యం కోల్పోయేలా వ్యవహరించకండి. పోలీసు బలగాలు, లాఠీలు, ఇనుప కంచెలు, బారికేడ్లతో విద్యార్థుల పోరాటాన్ని అణచివేసే ప్రయత్నం ఫలించదు. అది మరింత ఉధృతంగా మారతుంది. గ్రూప్స్ అభ్యర్థులు, నిరుద్యోగులను ఇబ్బందిపెట్టినా, భౌతికదాడులకు పాల్పడినా మేము చూస్తూ ఊరుకోబోమని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం.

– తన్నీరు హరీశ్‌రావు, మాజీ మంత్రి

రేవంత్ అబద్ధాలు సిగ్గుచేటు

రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి అబద్ధాలు చెప్తున్నారు. నిరుద్యోగులను కించపరుస్తున్నారు. మోతీలాల్ నాయక్ 2024 జూన్‌లో జరిగిన గ్రూప్-1 పరీక్ష రాసిండు. అతడు గ్రూప్-2, 3, 4 పరీక్షలకు దరఖాస్తు కూడా చేసుకున్నడు. అతడు సోషల్ మీడియాలో పెట్టిన హాల్‌టికెట్లే ప్రత్యక్ష సాక్ష్యం. నిరుద్యోగ యువకుల సమస్యలు పరిష్కరించకుండా సీఎం రేవంత్‌రెడ్డి కవ్వింపు చర్యలకు దిగడం దారుణం.

– మన్నె క్రిశాంక్, బీఆర్ఎస్ నాయకుడు

ఏ పరీక్షకు అప్లైచేసినవ్ రేవంత్

ఏ పరీక్షకు అప్లైచేసిండని రాహుల్‌గాంధీ ఆ రోజు అశోక్‌నగర్ వచ్చి నిరుద్యోగుల గురించి మాట్లాడిండు. రేవంత్‌రెడ్డీ నువ్వు ఏ పరీక్షకు అప్లైచేసినవ్ అని ఆ రోజు దీక్ష చేసినవ్. నిరుద్యోగ యువతను చులకన చేసి, అవహేళన చేస్తూ రేవంత్‌రెడ్డి మాట్లాడిన తీరు ఆయన అహంకారానికి నిదర్శనం. ముఖ్యమంత్రి వ్యాఖ్యలను బీఆర్ఎస్వీ తీవ్రంగా ఖండిస్తున్నది. వెంటనే డీఎస్సీ, గ్రూప్-2, 3 పరీక్షలు వాయిదా వేయాలి.

–తుంగ బాలు, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఏ పార్టీలతో సంబంధం లేదు

గ్రూప్-2 పోస్టులు పెంచి పరీక్షలు డిసెంబర్‌లో నిర్వహించాలి. మాకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదు. కష్టం వచ్చింది మాకు.. మేము నిరసనలు తెలుపుతుంటే మా వెనుక రాజకీయ పార్టీలు ఉన్నాయనడం పద్ధతికాదు. నిరుద్యోగులమైన మేము స్వతహాగా ఆందోళన చేస్తున్నాం. – నరసింహ, అభ్యర్థి

సీఎం మాటలు సరికాదు

నిరుద్యోగులను కించపరిచేలా సీఎం మాట్లాడడం సరికాదు. నిరుద్యోగులపై వివక్ష చూపుతున్నారు. గ్రూప్-1, డీఎస్సీలానే గ్రూప్ 2,3 పోస్టులు పెంచాలి. గ్రూప్స్ పరీక్షలు డిసెంబర్‌లో పెట్టాలి. – సుధీర్, అభ్యర్థి

రాజకీయ కోణంలో చూడొద్దు

పదేండ్లలో గ్రూప్-2 ఎగ్సామ్ ఒకేసారి జరిగింది. గ్రూప్-1,3 పరీక్షలు జరగలేదు. గ్రూప్ 2, 3 పోస్టులు పెంచి ప్రిపరేషన్ కోసం సమయమివ్వాలి. ఈ సమస్యను రాజకీయ కోణంలో చూడొద్దు. రాష్ట్ర భవిష్యత్ దృష్టితో చూడాలి.

– శ్రీకాంత్ రెడ్డి, అభ్యర్థి

రాహుల్ గాంధీ ఏ పరీక్ష రాస్తున్నడు?

- చిక్కడపల్లి లైబ్రరీలో మద్దతెందుకిచ్చారు?
- గాంధీభవన్‌లో రేవంత్ మౌనదీక్ష దేనికి?
- బల్మూరికి నీట్‌తో ఏం సంబంధం ?
- మా కోసం మీరెందుకు పోరాడారు?
- సీఎం రేవంత్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్న నిరుద్యోగులు

సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ అశోక్‌నగర్‌లో ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): ఉద్యోగార్థుల ఆందోళనకు సంఘీభావంగా దీక్షలు చేస్తున్న వారిపై సీఎం రేవంత్‌రెడ్డి అనుచితవ్యాఖ్యలు చేస్తున్నారని నిరుద్యోగులు మండిపడుతున్నారు. పోటీ పరీక్షలు రాసేవారు మాత్రమే దీక్షల్లో పాల్గొనాలన్నట్టుగా మాట్లాడటం సమంజసం కాదని పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి వాదనే సరైనది అయితే.. ఏ సంబంధమున్నదని రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, హస్తం పార్టీ నేతలు నిరుద్యోగుల పక్షాన దీక్షలో కూర్చున్నారని నిలదీస్తున్నారు. నిరుడు నవంబర్‌లో రాత్రి 8.30 గంటలకు సిటీ సెంట్రల్ లైబ్రరీకి రాహుల్ గాంధీ అకస్మాత్తుగా వచ్చారని.. ఆయన ఏ పరీక్ష కోసం ప్రిపేర్ కావడానికి వచ్చాడో చెప్పాలని నిరుద్యోగులు సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నిస్తున్నారు. రాహుల్‌గాంధీ లైబ్రరీ నుంచి నేరుగా అశోక్‌నగర్ చౌరస్తాకు వెళ్లి ఆందోళన చేస్తున్న విద్యార్థులతో కలిసి నిరసనకు దిగారని.. ఆయనకు ఏ పరీక్షలో అన్యాయం జరిగిందని అక్కడికి వెళ్లారో సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం' అని రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీలు ఏమయ్యాయో, ఆరు నెలలు గడిచినా ఒక్క ఉద్యోగానికీ నోటిఫికేషన్ ఇవ్వని రేవంత్‌రెడ్డి తక్షణం స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థులకు అండగా ఉంటూ..పోరాటాలు చేస్తున్న విద్యార్థి ఉద్యమ నాయకులపై సీఎ రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరుతున్నారు.

నీట్‌కు బల్మూరికి ఏం సంబంధం?

విద్యార్థులను, విద్యార్థి ఉద్యమాలను హేళన చేస్తూ ముఖ్యమంత్రి మాట్లాడిన అహంకారపూరిత మాటలు తమను తీవ్ర మానసిక క్షోభకు గురిచేస్తున్నాయని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రతి తలమాసినోడు పరీక్ష రద్దు చేయాలని కోరుతున్నాడని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారని.. మరి ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు ఏం సంబంధమున్నదని నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారని ప్రశ్నించారు. నీట్ పరీక్ష రద్దు కోరుతూ బల్మూరి వెంకట్ రాజభవన్‌ను ముట్టడించారని, ఆయనకు నీట్ హాల్ టికెట్ దొరికిందా? అని నిలదీస్తున్నారు. ప్రొఫెసర్ కోదండరాం కూడా గ్రూప్-1 పరీక్ష రద్దుకు ఉద్యమాలు చేశారని, కానీ ఆయన ఆ పరీక్ష రాయడానికి సిద్ధపడలేదు కదా అని గుర్తుచేస్తున్నారు. నిరుడు మార్చిలో నిరుద్యోగుల కోసం గాంధీ భవన్‌లోని గాంధీ విగ్రహం వద్ద పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి మౌన దీక్షకు కూర్చున్నారని, 'మీరు ఏ పరీక్ష రాయడం కోసం పోరాడారో వివరించాలి' అని డిమాండ్ చేస్తున్నారు.

నాడు మాకు ధైర్యం ఇచ్చిన రాహుల్ ఎక్కడ?

నిరుద్యోగులు ధైర్యం కోల్పోవద్దని, అండగా ఉంటామని కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ నాడు భరోసా ఇచ్చారని, ఇప్పుడు తాము అదే అశోక్‌నగర్ చౌరస్తాలో ధర్నా చేస్తుంటే రాహుల్‌గాంధీ ఏం చేస్తున్నారని నిలదీస్తున్నారు. ఇప్పుడు కూడా హైదరాబాద్ వచ్చి తమను ఓదార్చాలని డిమాండ్ చేస్తున్నారు. నాడు నిరుద్యోగులతో కలిసి చాయ్ తాగుతూ ముచ్చటించిన రాహుల్‌గాంధీ.. మళ్లీ తమ సమస్యలు వింటూ చాయ్ తాగేందుకు రావాలని కోరుతున్నారు. నాడు రాహుల్ గాంధీ ఇచ్చిన ధైర్యంతోనే నేటికీ జాబ్ క్యాలెండర్ కోసం ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు.

ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలిస్తాం

హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతను కలిశాను. తెలంగాణ వస్తే తమకు కొలువులు వస్తాయని ఆశించామని, రాష్ట్రం వచ్చి పదేండ్లయినా తమ ఆకాంక్షలు నెరవేరలేదని వారు ఆవేదన వ్యక్తం చేయడం నన్ను కలిచివేసింది. కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణ యువతకు న్యాయం జరగలేదు. 30 లక్షల మంది నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోయారు. వారు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలోనే వారికి కొలువులు రాని దుస్థితి. అందుకే వారి కలలు సాకారం అయ్యేలా.. కాంగ్రెస్ పార్టీ రూపొందించిన జాబ్ క్యాలెండర్‌ను వారికి చూపించి వారిలో భరోసా నింపే ప్రయత్నం చేశాను. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే 2 లక్షల నియామకాలను పూర్తి చేసి యువతకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం.

-రాహుల్ గాంధీ

లోకం పోకడ

ఇది హాల్ టికెట్టా? బస్ టిక్కెట్టా?

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	37.3°c	24.6°c
మెదక్	36.1°c	23.0°c
రంగారెడ్డి	35.7°c	22.4°c
మహబూబ్‌నగర్	34.4°c	23.0°c
కరీంనగర్	32.0°c	25.0°c
నిజామాబాద్	31.2°c	24.4°c
వరంగల్	31.0°c	24.0°c
హైదరాబాద్	30.4°c	24.0°c
నల్లగొండ	29.5°c	21.4°c
ఖమ్మం	28.0°c	25.0°c

ఎల్లుండి సెక్రటేరియట్ ముట్టడి

10 డిమాండ్ల పరిష్కారమే లక్ష్యం: నిరుద్యోగ యువత

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నిరుద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఈ నెల 15న రాష్ట్ర సచివాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలంగాణ నిరుద్యోగ యువత పిలుపునిచ్చింది. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన 10 ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని ఈ ఆందోళన చేపడుతున్నట్టు తెలిపారు. గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తి అమలు, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్, మూడు నెలలు డీఎస్సీ పరీక్షల వాయిదా, గ్రూప్ 2, 3 పరీక్షల వాయిదా, పోస్టుల సంఖ్య పెంపు తదితర హామీలను నెరవేర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి నిరుద్యోగ యువత, వివిధ పరీక్షల అభ్యర్థులు పెద్ద ఎత్తున తరలివస్తారని పేర్కొన్నారు. ముట్టడి కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ నేత ఆర్ కృష్ణయ్య, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, నిరుద్యోగ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు రాజారామ్‌యాదవ్ తదితరులు సెక్రటేరియట్ గేటు వద్ద నిరుద్యోగులు నిర్వహించే శాంతియుత నిరసనకు మద్దతుగా రానున్నట్టు తెలిపారు.

ఆఖరు నిమిషంలో పరీక్షాకేంద్రాల మార్పు

అయోమయంలో ఏఈ, కెమిస్ట్ అభ్యర్థులు

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): ఆదివారం పరీక్ష. అది ఉదయం 9గంటలకే.ఈ సమయంలో శనివారం సాయంత్రం అకస్మాత్తుగా పరీక్షాకేంద్రాల మార్పు. ఒక సెంటర్‌కు బదులుగా మరో సెంటర్‌లో పరీక్ష. ఇది తెలంగాణ జెన్‌కో నిర్వహించే పరీక్షలో జరిగిన తంతు. జెన్‌కో పరిధిలోని ఏఈ, కెమిస్ట్ ఉద్యోగాల భర్తీకి ఆదివారం కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) నిర్వహించనున్నారు. హాల్‌టికెట్లనూ జారీచేశారు. సాంకేతిక కారణాలతో మూడు పరీక్షాకేంద్రాలను ఆకస్మికంగా మార్చారు. కేపీఎం టెక్నాలజీ సొల్యూషన్స్‌కు చెందిన మూడు సెంటర్ల స్థానంలో బోజిరెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో రెండు షిఫ్టులు, ఎంవీఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీలో ఒక షిఫ్ట్ పరీక్షరాసేలా సెంటర్లు మార్చారు. దీంతో ఆయా పరీక్షా కేంద్రాల్లో హాజరుకావాల్సిన వారు ఏం జరిగిందో తెలియక కంగారుపడ్డారు.

ఒకే రోజు.. ఒకే సెంటర్‌లో పరీక్ష

14 మంది డీఎస్సీ అభ్యర్థులకు కేటాయింపు

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ పరీక్ష కేంద్రాలను అస్తవ్యస్తంగా కేటాయించిన పాఠశాల విద్యాశాఖ తాజాగా దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఒకే రోజు పరీక్ష ఉన్న అభ్యర్థులకు దూరాన ఉన్న వేర్వేరు జిల్లాల్లో కేంద్రాలను కేటాయించింది. తాజాగా ఒకేరోజు పరీక్ష ఉన్నవారికి ఒకే సెంటర్‌లో పరీక్ష కేందాలను కేటాయించింది. ఇలా 14 మంది అభ్యర్థులకు ఒకే కేంద్రంలో పరీక్ష రాసే అవకాశాలు ఇచ్చినట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఈవీ నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 'డీఎస్సీ పరేషాన్' పేరుతో 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ప్రత్యేకించి స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసిన వారికి ఒక్కో పరీక్షను ఒక్కో జిల్లాలో అధికారులు కేటాయించారు. ఈ నెల 18, 20, 30 తేదీల్లో పరీక్షలు ఉన్నవారికి ఇలా కేంద్రాలను కేటాయించారు. దీంతో విద్యాశాఖ ఆ 14 మందికి ఒకే సెంటర్‌లో కేంద్రాన్ని కేటాయించింది. ఆయా అభ్యర్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ 14 మంది ఆన్‌లైన్‌లో పొందుపరిచిన సమాచారం సరిగ్గా లేనందున ఆయా అభ్యర్థులకు కంప్యూటర్ సిస్టం ద్వారా దూరంగాకేంద్రాలను కేటాయించామని అధికారులు వివరణ ఇచ్చారు. ఇలాంటి లోపాల సవరణకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌లో డీఎస్సీ స్టేట్ సెల్ నిరంతరం అందుబాటులో ఉన్నదని తెలిపారు. డీఎస్సీ అభ్యర్థులు 91541 14982, 6309998812 నంబర్‌ను సంప్రదించి సందేహాలు, సమస్యలను పరిష్కరించుకోవచ్చని సూచించారు. శనివారం వరకు 1,64,652 అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నట్టు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.